

## ఘన స్వాగతం

తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న బీఆర్‌ఎస్‌కు ముస్లిం న్యాయవాదుల సంపూర్ణ మద్దతు ఉంటుందని వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ పేర్కొన్నారు. జలవిహార్‌లో జరిగిన న్యాయవాదుల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు పుష్ప గుచ్ఛం అందించి వహీద్ అహ్మద్, ఫహీం ఘన స్వాగతం పలికారు.

**- అబిడ్స్, నవంబర్ 4**

## రాజాసింగ్ నామినేషన్

### మూడుకు చేరిన నామినేషన్లు



గోషామహల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్‌కు నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న రాజాసింగ్

అబిడ్స్, నవంబర్ 4 : రెండో రోజు మరో నామినేషన్ దాఖలైంది. దీంతో గోషామహల్ నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లయ్యింది. మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలు కాగా రెండో రోజైన శనివారం గోషామహల్ బీజేపీ అభ్యర్థి టి.రాజాసింగ్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌కు దాఖలు చేశారు. బుల్లెట్ వాహనంపై అబిడ్స్‌లోని జీహెచ్‌ఎంసీ భవన సముదాయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని గోల్కొండ జిల్లా బీజేపీ అద్యక్షుడు వి.పాండు యాదవ్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్, బోయిని వెంకటేశ్‌యాదవ్‌తో కలిసి కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గంగాబౌలిలోని ఆకాశ్ పురి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. గోమాతకు పూజలు చేసిన అనంతరం ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా బయలు దేరారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ర్యాలీలో పాల్గొని రాజాసింగ్‌కు అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహద పడ్తాయన్నారు. రాజాసింగ్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ ప్రధాని నరేంద్రమోడీ వరకు చేరుకుందని తెలిపారు రాజాసింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ ఎమ్మెల్యేగా నాలుగున్నర సంవత్సరాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాను చేపట్టిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. ఆకాశ్ పురి హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ పలు ప్రాంతాల మీదుగా తిరిగి నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి చేరుకున్నది. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాకేశ్ జైస్వాల్, శశికళ కృష్ణ, వనమాల గోపాల్, కృష్ణ పాల్గొన్నారు.

## రాజాసింగ్‌పై 75 కేసులు

అబిడ్స్, నవంబర్ 4 : గోషామహల్ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన టి. రాజాసింగ్ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు ఫారం-26 అఫిడవిట్‌ను గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్‌కు దాఖలు చేశారు. అఫిడవిట్‌లో రాజాసింగ్‌పై పలు పోలీస్ స్టేషన్‌లలో 75 కేసులు నమోదైనట్లు ధ్రువీకరించారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మరికొన్ని కేసులు పెరిగాయి. ఇందులో అత్యధికంగా షాహినాయత్ గంజ్, మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లలో ఉండగా కలకత్తా, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో పలు కేసులు కూడా నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రాజాసింగ్ భార్యాభర్తల వద్ద మొత్తం 350 గ్రాముల బంగారం, రాష్ట్రంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, మూడు కార్లు, రెండు బుల్లెట్, మోటార్ సైకిల్ ఉన్నట్లు తన అఫిడవిట్‌లో ధ్రువీకరించారు. అదే విధంగా పలు బ్యాంకుల్లో అప్పులు కూడా ఉన్నట్లు పొందు పరిచారు.

# స్వపాలనలో.. పాతనగరం అభివృద్ధి

- తోప్‌ఖాన నాలా పొంగి పొర్లకుండా చర్యలు
- చాక్నావాడి నాలా పునః నిర్మాణ పనులు
- ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారం



తోప్‌ఖాన నాలా

అబిడ్స్, నవంబర్ 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసినప్పుడు నాలాలు పొంగి పొర్లి బస్తీల్లోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడే వారు. నీరు బస్తీల్లోని నివాసాలలోకి చేరుకుని సరుకులు తడిసి ముద్దై నష్ట పోయే వారు. పలు ప్రాంతాల్లో ముంపు చోటు చేసుకునేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆయా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించింది. దీంతో నేడు ఎంత పెద్ద వాన కురిసినా ప్రజలు ఇబ్బందులు లేకుండా గడుపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని తోప్‌ఖాన నాలా ఇరుకుగా మారడం వలన వర్షం నీరు రహదారులపైకి చేరి తోప్‌ఖాన నిండి పోవడంతో పాటు పరిసర ప్రాంతాల బస్తీలలోని నివాసాలకు నీరు వచ్చి చేరేది. ఉస్మాన్‌గంజ్ మార్కెట్‌లోకి నీరు చేరి వ్యాపారుల సరుకులు తడిసేవి. పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధతో నాలా నీరు పొంగి పొర్లకుండా ఉండేందుకు గాను నాలాను విస్తరించి బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా పనుల నిమిత్తం మంత్రి చొరవ తీసుకుని నిధులు విడుదల చేయించారు. ప్రధాన రహదారి కావడంతో అధికారులు ఈ ప్రాంతం మీదుగా రాక పోకలు నిలిపి వేసి పనులను చేపట్టారు. ఆరు నెలల సమయంలో పనులను పూర్తి చేయించి అందు బాటులోకి తీసుకు వచ్చారు. దీంతో స్థానికులు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గోషామహల్ ప్రాంతంలో కుంగిపోయిన నాలా నిర్మాణం చేసిన అధికారులు

**కుంగి పోయిన నాలా పునః నిర్మాణ పనులు పూర్తి..**

గోషామహల్ చాక్నావాడి ప్రాంతంలో నాలా కుంగి పోయి కుప్ప కూలి పోవడంతో ప్రభుత్వం కోటి రూపాయల పైచిలుకు నిధులను విడుదల చేయించి పనులను పూర్తి చేయించింది. చాక్నావాడి నాలా అకస్మాత్తుగా కుంగి పోయి కుప్ప కూలి పోయింది. పలు వాహనాలు పడి పాక్షికంగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సందర్శించి నాలా పునః నిర్మాణ పనులు చేపట్టేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు దాదాపు కోటి పై చిలుకు రూపాయల వ్యయంతో పనులు చేపట్టేందుకు గాను నిధులను విడుదల చేశారు. దీంతో అధికారులు వెంటనే పనులను చేపట్టి పూర్తి చేశారు.

**ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారం..**

వర్షాలు కురిసినప్పుడల్లా మొజాంజాహి మార్కెట్, రంగ్‌మహల్ చౌరస్తా, కంట్రోల్ రూం,నాంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం నీరు మోకాలి లోతు నిలిచి పోయేది. దీంతో అధికారులు వర్షం నీరు నిలువకుండా ఉండేందుకు గాను పలు చర్యలను చేపట్టారు. మొజాంజాహి మార్కెట్ చౌరస్తాలోని రాతి కట్టడం మున్సిపల్ కాంప్లెక్స్ మెరుగులు దిద్దారు. ఇందులో భాగంగా డ్రైనేజీ, వర్షం నీటి కాలువలను నిర్మించి సమస్యను పరిష్కరించారు. అదే విధంగా రంగ్‌మహల్ చౌరస్తా, కంట్రోల్‌రూం, నాంపల్లి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుని వర్షం కురిసినప్పుడు వర్షం నీరు నిలవకుండా చేశారు.

## అక్షయ భరతనాట్యం అదరహో





నిత్యారామనాథన్ శిష్యురాలు అక్షయ రాంపల్లి ప్రదర్శించిన నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. అరంగేట్రంలోనే క్లిష్టమైన అద్భుత అంశాలను ప్రదర్శించి ఔరా అనిపించింది. శనివారం రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై నృత్యాంజన్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అక్షయ భరత నాట్య రంగ ప్రవేశం కనుల పండువగా జరిగింది. అక్షయ ఐదు సంవత్సరాల నుంచే శాస్త్రీయ నృత్యంపై ఆసక్తితో ప్రముఖ నాట్య గురువు నిత్యా రామనాథన్ దగ్గర భరత నాట్య శిక్షణ పొందుతూ సాధన చేస్తూ తొలిసారి సోలో ప్రదర్శనతో ముందుకు వచ్చారు. తొలుత ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కె.వి. రమణాచారి జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ.. మొదట అక్షయను అభినందిస్తూ ఏ రంగంలో ఉన్నప్పటికీ నాట్య రంగంలో రాణించాలని , నర్తకీమణిగా రాణించే లక్షణాలు అక్షయలో ఉన్నాయని ఆయన ఆశీర్వదించారు. నాట్యగురువు నిత్యారామనాథన్‌ను సంప్రదాయ రీతిలో సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రమ, శ్రీధర్ రాంపల్లి పాల్గొన్నారు.

**- రవీంద్రభారతి,నవంబర్ 4**

## ఆకట్టుకున్న వస్త్రధారణ ఎగ్జిబిషన్



సాంస్కృతిక కళాబంధు సారిపల్లి కొండల్‌రావు, యువకళావాహిని, అపర్ణా ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ పోలెన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని ఫొటో గ్యాలరిలో భారతీయు సంప్రదాయక వస్త్రధారణ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన మహిళల వస్త్రధారణపై చెక్కిన భారతీయ సంస్కృతిక, సంప్రదాయాల వస్త్రాలను డాక్టర్ మామిడి హరికృష్ణ తిలకించారు. భారతీయ కళా సంపదను మహిళా కళాకారులు అద్భుతంగా చిత్రీకరించారని కొనియాడారు. కార్యక్రమంలో పి.అపర్ణ, ప్రసన్న కుమారి, సోనాం కపూర్,ఆల్కా మనోజ్, నీతా సుధాకర్,హేమమాలిని,సీమా గయా,బీనా అరుణ ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ప్రముఖ కవి రఘుశ్రీ పాల్గొన్నారు. **- రవీంద్రభారతి, నవంబర్ 4**

## నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒప్పందం



ఓడిన్ స్కూల్‌తో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఓడిన్ స్కూల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్ పసుపులతి మాట్లాడుతూ.. గణణీయమైన అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఓడిన్ స్కూల్ ప్రారంభించినట్లు తెలిపారు. దేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ఓడిన్ స్కూల్ పట్ట భద్రులు ఇప్పుడు జాతీయ ప్రభుత్వ సంస్థచే ధ్రువీకరించబడతారన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పోర్టల్ నుంచి వారి సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందని వివరంచారు. ఓడిన్ స్కూల్ విద్యార్థులు వాల్‌మార్ట్, బాష్, ఇన్ఫోసిస్, ఐబీఎం, ఫెడ్‌ఎక్స్, జేపీ మోర్గాన్ మొదలైన కంపెనీల్లో అనుభవజ్ఞులతో బోధించపడతారని వివరించారు. **- అబిడ్స్, నవంబర్ 4**